సాక్షి చిత్తూరు

సోమవారం । 17 । ఏప్రిల్ । 2023



మరో ఏడాది ఉచితం

చిత్తూరు అర్బన్: చిత్తూరు మార్కెట్ గేటు వసూళ్లు మరో ఏడాది ఉచితం. ఈ మేరకు ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి రూ.83 లక్షలు కార్పొరేషన్‌కు చెల్లించారు. - 8లో



తగ్గుముఖం పట్టిన నీరు

తిరుమల: ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రంలో ఎండల తీవ్రత పెరగడంతో డ్యాముల్లో నీటి శాతం తగ్గుముఖం పట్టింది. దీంతో తిరుమలలో అధికారులు నీటి వృథాను అరికట్టే చర్యలు చేపడుతున్నారు.

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	39	22
తిరుపతి	41	22
తిరుమల	36	18
గూడూరు	41	24
నగరి	41	23

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమవారం(సా)	సహర్ మంగళవారం(ఉ)
తిరుపతి	6.29	4.37
చిత్తూరు	6.31	4.37
పుంగనూరు	6.33	4.41

న్యూస్‌రీల్

జగనన్న వసతి దీవెన వాయిదా

చిత్తూరు కలెక్టరేట్ : పలు కారణాల వల్ల ఈనెల 17న జిల్లా స్థాయిలో నిర్వహించాల్సిన జగనన్న వసతిదీవెన కార్యక్రమం వాయిదా పడినట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి తెలిపారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ జగనన్న వసతి దీవెన 2022–23 విద్యాసంవత్సరం తొలివిడత అర్హత కలిగిన విద్యార్థులకు నగదు జమ కార్యక్రమం ఈనెల 17 జరగాల్సి ఉండగా.. వాయిదా పడిందని పేర్కొన్నారు. తదుపరి తేదీ రాష్ట్ర అధికారులు వెల్లడించిన వెంటనే తెలియజేస్తామని ఆమె తెలిపారు.

నేడు పోలీసు స్పందన

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వై.రిషాంత్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. చిత్తూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఆర్మ్డు రిజర్వ్‌డ్ (ఏఆర్) కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని.. ఏవైనా సమస్యలుంటే నేరుగా తనను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

కథా పురస్కారానికి 'కలుంకూరి గుట్ట' ఎంపిక



మేఘనాథరెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : గంటా కమలమ్మ స్మారక కథా పురస్కారానికి కేవీ మేఘనాథరెడ్డి కథా సంపుటి 'కలుంకూరి గుట్ట' ఎంపిక అయ్యిందని ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు, పురస్కార వ్యవస్థాపకుడు గంటామోహన్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కథా పురస్కారానికి రాయలసీమ నుంచి 2021, 2022 సంవత్సరాల్లో ముద్రితమైన కథా సంపుటాలను పోటీకి ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. మొత్తం 29 మంది ప్రముఖ రచయితల నుంచి అందిన సంపుటాలలో కలుంకూరి గుట్ట పుస్తకాన్ని అత్యుత్తమంగా న్యాయనిర్ణేతలు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. త్వరలో నిర్వహించే పురస్కార ప్రదానోత్సవంలో రచయితకు నగదు బహుమతి, జ్ఞాపికతో సత్కరిస్తామని తెలిపారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



భరత నాట్యం చేస్తున్న చిన్నారులు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను అలరించాయి. తిరుపతికి చెందిన నరేష్ బృందం ఆధ్వర్యంలో చిన్నారులు భరతనాట్యం ప్రదర్శించారు. పుష్పాంజలి, మూషిక వాహన మోదక, గోవిందా శ్రిత గోకుల బృందా, గణ నాయకాయ గణదిత్య, బ్రహ్మ మొక్కటే పర బ్రహ్మమొక్కటే, శివతాండవం శంభో శివ శంభో, ఆకు పరాకు మమ్మేలు అమ్మ పరాకు, వచ్చెను అలమేలు మంగ అటు వంటి కీర్తనలకు కళాకారులు గురువు నరేష్, వర్షిత, ఇషా, లలన్ రాజ్, జస్వంత్, యశస్వి, రిత్విక, హేమా శ్రీ, రమ్య, హేమంత్, సురేంద్ర ప్రదర్శనలు అబ్బురపరిచాయి. పాటకు తగ్గ అభినయం, హావభావాలతో కళాకారులు నృత్యాలు చేశారు. వారి ప్రదర్శనలకు ముగ్ధులైన ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో అభినందనలు తెలిపారు. అనంతరం కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాధకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కోనలో చలువ పందిళ్లు

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. దేవాలయం చుట్టూ భక్తులు ప్రదక్షిణ చేయడానికి ఇబ్బంది లేకుండా ఈ ఏర్పాట్లు చేశారు. మే 1 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నట్లు దేవాలయ అధికారులు వివరించారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.



అందుకున్న బహుమతులతో దీక్షిత, రిషిత

నాట్య మయూరాలు

- కూచిపూడిలో రాణిస్తున్న అక్కాచెల్లెళ్లు
- ఇప్పటికే వందకు పైగా ప్రదర్శనలు, పురస్కారాలు
- తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే అంటున్న అమ్మాయిలు
- చదువులోనూ రాణిస్తున్న కుప్పం చిన్నారులు

కూచిపూడి నృత్యంలో కుప్పం చిన్నారులు రాణిస్తూ.. పతకాల పంట పండిస్తున్నారు. జాతీయ స్థాయిలో ప్రదర్శనలు ఇస్తూ ప్రతిభ చాటుతున్నారు. చదువుతోపాటు అతిపిన్న వయస్సులో అక్కాచెల్లెళ్లు నృత్య ప్రదర్శనల్లో మెరుస్తున్నారు. కళాభిమానులు పరవశించేలా హృద్యమైన హావభావ విన్యాసాలతో నృత్య ప్రదర్శనలు చేస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. ఐదు రాష్ట్రాల్లో వందకుపైగా ప్రదర్శనలు, పురస్కారాలు అందుకున్న ఈ ఇద్దరూ దీక్షిత, రిషిత కుప్పం పట్టణానికి చెందిన టీస్టాల్ యజమాని కుమార్తెలు కావడం విశేషం.

కుప్పంరూరల్: కుప్పం పట్టణంలో టీ స్టాల్ యాజమాని శరవణ కుమార్తెలు దీక్షిత, రిషిత చిన్న వయసులోనే కూచిపూడి నృత్యంలో హేమాహేమీలను తలపిస్తున్నారు. దీక్షిత పదవ తరగతి, రిషిత 6వ తరగతి చదువుతోంది. కుప్పం పబ్లిక్ స్కూల్లో వీరిద్దరూ చదువుతున్నారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు పాఠశాల చదువులు..తర్వాత రాత్రి 8.30 నుంచి గురువు కల్పన వద్ద కూచిపూడి సాధన చేస్తున్నారు. దీక్షిత 8వ ఏట నుంచి, రిషిత 4వ ఏట నుంచి కూచిపూడి నాట్యశాలలోని కల్పన వద్ద సాధన చేస్తున్నారు. అనతి కాలంలోనే అక్కాచెల్లెళ్లు కూచిపూడిలో రాటుదేలారు. చక్కటి అభినయాలతో అవార్డుల పంటను కురిపిస్తున్నారు.



తండ్రి శరవణతో అక్కాచెల్లెళ్లు దీక్షిత, రిషిత

ప్రతిభకు తార్కాణాలు

పదిహేనేళ్లలో దీక్షిత, 11ఏళ్ల వయస్సులో అక్కచెల్లెళ్లు వందకుపైగా ప్రదర్శనలు ఇచ్చి పురస్కారాలు అందుకున్నారు. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఢిల్లీ రాష్ట్రాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. హంపి, కాణిపాకం, తంజావూరు, వేలూరు గోల్డెన్ టెంపుల్ లాంటి చారిత్రక ప్రదేశాల్లో ప్రదర్శనలు ఇచ్చి శభాష్ అనిపించుకున్నారు. ప్రముఖ నాట్యకారుడు శివశంకర్ మాస్టర్, చిన్నజియ్యర్‌స్వామి తదితరుల వద్ద ప్రశంసలు అందుకున్నారు.

తల్లిదండ్రుల సహకారం...

తమ కుమార్తెలు దీక్షిత, రిషితలకు తల్లిదండ్రులు శరవణ, రాజ్యలక్ష్మి పూర్తి సహకారం అందిస్తున్నారు. కుమార్తెల లక్ష్యానికి అడ్డురాకూడదని శరవణ టీస్టాల్లో రేయింబవళ్లు కష్టపడుతున్నాడు. సమయానికి కుమార్తెలను పాఠశాలకు, నాట్యశాలకు పంపుతున్నారు. పిల్లల ప్రదర్శనతో లభించే పొగడ్తలు, నీరాజనాన్ని చూసి తల్లిదండ్రులు తమ కష్టాన్ని ఇట్టే మరిచిపోతున్నారు.

గురువులా పేరు తెచ్చుకోవాలి

గురువు కల్పన పాఠశాల వార్షికోత్సవం సమయంలో చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శనను ఆదర్శంగా తీసుకున్నాం. మేము కూడా పెద్ద నృత్య కళాకారిణులుగా కావాలని అప్పుడే నిర్ణయించుకున్నాం. ఈ విషయం అమ్మనాన్నకు చెప్పాం. వారు కూడా సంతోషంతో అంగీకరించి నృత్య సాధనకు పంపారు. గురువు కల్పన ప్రోత్సాహంతో నృత్యప్రదర్శనల్లో రాణిస్తున్నాం. – దీక్షిత,రిషిత

వైఎస్సార్ కుటుంబంతోనే

మైనారిటీల అభ్యున్నతి



పుంగనూరులో ముస్లింల సదస్సులో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- 6 శాతం రిజర్వేషన్లు కల్పించిన వైఎస్సార్
- మైనారిటీలకు అండగా సీఎం జగన్
- తప్పుడు కేసులతో చంద్రబాబు రిజర్వేషన్ల కుదింపు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- 26 మసీదులకు రూ.15 వేల చొప్పున పంపిణీ

పుంగనూరు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చలువతోనే ముస్లిం మైనారిటీలకు దేశంలోనే గుర్తింపు లభించిందని, ముస్లింలకు 6 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఆయనదేనని రాష్ట్ర విద్యుత్, గనులశాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి పట్టణంలో ముస్లింలకు మంత్రి ఇఫ్తార్‌విందు ఇచ్చారు. ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప, జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌తో కలసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడు తూ ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నా మైనారిటీల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాల చేయూతనిస్తున్నారని తెలిపారు. రిజర్వేషన్లకు మించి అవకాశం ఇచ్చినట్లు పేర్కొన్నారు. రాజన్న ప్రభుత్వం 6 శాతం రిజర్వేషన్ కల్పిస్తే, చంద్రబాబు తప్పుడు కేసులు దాఖలు చేసి అడ్డుకున్నారని తెలిపారు. దీని కారణంగా సుప్రీంకోర్టు 4 శాతానికి కుదించిందని తెలిపారు. మైనారిటీల అభివృద్ధి వైఎస్సార్ కుటుంబంతోనే సాధ్యమైందని కొనియాడారు. మైనారిటీలకు ఏకష్టం వచ్చినా అండగా తమ కుటుంబం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఒక్కొక్క మసీదుకు మంత్రి సొంత నిధులు రూ.15 వేల చొప్పున 26 మసీదు లకు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, నవాజ్‌బాషా, చిత్తూరు మేయర్ అముద, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెద్దిరెడ్డి, బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, రెడ్డెప్ప, రాష్ట్ర జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, రాయలసీమ జిల్లాల మైనారిటీ సెల్ అధ్యక్షు డు ఫక్రుద్దీన్‌షరీఫ్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఎంఎస్.సలీం పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే అంటే ముస్లిం మైనారిటీ

ఎంపీ, ఎమ్మెల్యే అంటే ముస్లిం మైనారిటీలని, వారి ఆశీస్సులతో తాము ఎన్నికల్లో విజయం సాధిస్తున్నామని, ఈ ప్రేమాభిమానాలు ఎల్లప్పుడూ ఇలాగే ఉండాలని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు. ఇఫ్తార్ విందులో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడుతూ ముస్లింల సమాధుల వద్ద కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.2.50 కోట్లు ఇస్తామన్నారు. షాదీమహాల్‌కు రూ.6 కోట్లు మంజూరు చేశామని తెలిపారు.



మసీదులకు నగదు పంపిణీ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి , ఎంపీ మిథున్‌రెడ్డి

జగనన్న చెప్పారంటే.. చేస్తారంతే

నగరి : 'సీఎం జగనన్న చెప్పారంటే.. చేస్తారంతే' అని రాష్ట్ర పర్యాటక, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. మున్సిపల్ పరిధి 8వ వార్డులో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. మహిళలు హారతులతో స్వాగతం పలికారు. ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమాన్ని అంకెలతో సహా వివరిస్తూ మంత్రి బుక్‌లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మొదటి రోజు నుంచే ప్రభుత్వానికి ప్రజలంతా సమానమని, పార్టీ విభేదాలు చూడకుండా అందరికీ న్యాయం చేయాలని చెబుతూ ఆదర్శవంతమైన రాజకీయాలకు తెరతీశారని చెప్పారు. నిరుపేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి సంక్షేమ పథకం ద్వారా ప్రజలు నేరుగా ఆర్థిక లబ్ధిని పొందుతున్నారని తెలిపారు. ఎవరి బ్యాంకు ఖాతాలకు ఏ సంక్షేమ పథకం కింద ఎంత మొత్తం అందుతుందో చెప్పేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో పేద ప్రజల ఉన్నతికి తెలుగుదేశం పార్టీ ప్రయత్నించిన దాఖలాలు కూడా లేవన్నారు. ఇచ్చిన హామీలను చంద్రబాబు ఒక్కటైనా నెవవేర్చారా అని ప్రజలు ఆలోచించాలని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌చైర్మన్ బాలన్, కౌన్సిలర్ అణ్ణెమ్మ, దయానిధి, నాయకులు యాకోబు, అధికారులు పాల్గొన్నారు.



సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి ఆర్కేరోజా

లోకేష్ వ్యాఖ్యలపై భగ్గుమన్న దళితులు

బంగారుపాళెం: యువగళం పాదయాత్రలో టీడీపీ నాయకుడు నారా లోకేష్ దళితులను ఉద్దేశించి చేసిన వివాదస్పద వ్యాఖ్యలపై ఆదివారం సాయంత్రం బంగారుపాళెంలో దళితులు, దళిత నాయకులు, ప్రజాప్రతినిధులు ఆందోళ చేపట్టారు. లోకేష్ వ్యాఖ్యలపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈనెల 13వ తేదీ నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గం జక్కసానిపల్లెలో లోకేష్ ఎస్సీలతో ముఖాముఖి కార్యక్రమంలో విదేశీ విద్య, అవుట్ సోర్సింగ్, కస్తూర్బా గురుకుల పాఠశాల ఉద్యోగులను పర్మినెంట్ చేసే విషయంలో టీడీపీ వైఖరి ఏమిటో చెప్పాలని అక్కులప్ప అనే దళితుడు ప్రశ్నించాడు. అలాగే టీడీపీ అధికారంలోకి వస్తే అంబేడ్కర్ విదేశీ విద్య అని పేరు మారుస్తారా అని అడగ్గా... అందుకు లోకేష్ 'విదేశీ విద్యపై పోరాడింది నేనే, దళితులు పీకిందిలేదు.. పొడిచింది లేదు, ఈయన పేరు పెట్టేందుకు' అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై ఆగ్రహించిన దళితులు స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద జాతీయ రహదారిపై నల్ల జెండాలు చేతపట్టి ఆందోళనకు దిగారు. లోకేష్ దిష్టి బొమ్మను దహనం చేశారు. దళిత నాయకులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ టీడీపీకి దళితులంటే పట్టదన్నారు. గతంలో లోకేష్ తండ్రి చంద్రబాబు ఎస్సీల్లో పుట్టాలని ఎవరు కోరుకుంటారు అని వ్యాఖ్యానించిన విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహామండలి జిల్లా చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్, ఎంపీటీసీ సభ్యురాలు ఉష, దళిత నాయకులు సుబ్రమణ్యం, మాణిక్యం, జేమ్స్, జగదీష్, చంద్రకాంత్, వెంకటేష్, ధనంజయ, దళిత ప్రజాప్రతినిధులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.



లోకేష్ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న దళితనాయకులు

జనజన బోయకొండ

- భక్తులతో కిక్కిరిసిన ఆలయం
- ఉదయం 6నుంచి కొనసాగిన రద్దీ
- 60 వేల మందికి పైగా భక్తుల దర్శనం

చౌడేపల్లి: కోరిన కోర్కెలు తీర్చే ఆరాధ్య దైవంగా విరజిల్లుతున్న బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్త జనసంద్రంగా మారింది. ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు రద్దీ కొనసాగింది. ఒక్క రోజే సుమారు 60 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు దేవస్థానం అధికారులు వెల్లడించారు. ఆదివారం సెలవురోజు కావడంతో పాటు ఇంటర్, పదో తరగతి పరీక్షలు ముగియడంతో అధిక సంఖ్యలో బోయకొండకు భక్తులు తరలివచ్చారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు కుటుంబ సమేతంగా, బంధువులతో హాజరై మొక్కులు చెల్లించారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తుల రద్దీ ఊహించని రీతిలో నెలకొనడంతో ఉచిత దర్శనం, కుంకుమార్చన, ప్రత్యేక దర్శనం క్యూలు రద్దీతో కిటకిటలాడాయి. అధికారులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

సమస్యలను ఆరా తీసిన పెద్దిరెడ్డి

బోయకొండ అమ్మవారిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఈఓ చంద్రమౌళితో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం క్యూలో ఉన్న భక్తులతో మాట్లాడారు. ఆలయం వద్ద వసతులు, దర్శన సేవలు, ఇతర సమస్యలేమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఉచిత ప్రసాదం, పూలు, పండ్లు, నిమ్మపండు, కుంకుమ అందేలా కౌంటర్లు ఏర్పాట్లు చేయడం అభినందనీయమని భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.



క్యూలో వేచి ఉన్న భక్తులు

భక్తి భావం పెంపొందించేలా..

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో భక్తిభావం పెంపొందేలా.. భక్తులు ప్రశాంత దర్శనం చేసుకునేలా దేవస్థానం చర్యలు తీసుకుంది. నెల రోజులుగా సెల్‌ఫోన్ల సమస్యలతో ఆలయ అధికారులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినే పరిస్థితులు రాకముందే పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. సెల్‌ఫోన్లను ఆలయంలోకి పూర్తిగా నిషేధించారు. ప్రవేశ కౌంటర్ల వద్ద కూడా తిరుమల తరహాలో నిఘా ఏర్పాటు చేశారు. వీఐపీలు పీఆర్‌వో కార్యాలయం నుంచి దర్శనం చేసుకునేలా చర్యలు తీసుకున్నారు.

- కాణిపాకం ఆలయంలో సెల్‌ఫోన్ల నిషేధం
- అక్రమాలకు చెక్‌పెట్టేలా చర్యలు
- వీఐపీలకు పీఆర్‌ఓ కార్యాలయం నుంచి దర్శనం



సెల్‌ఫోన్ల నిషేధం పటిష్టంగా అమలు చేయాలని ఆదేశిస్తున్న ఆలయ అధికారి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో సెల్‌ఫోన్లతో ప్రవేశం, అక్రమాలపై దేవస్థానం అధికారులు సీరియస్ అయ్యారు. కఠిన చర్యల అమలకు ఆదేశాలు జారీ చేశారు. నెల రోజులుగా ఆలయంలో, ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాల పటిష్టత కొరవడంతో నిత్య అన్నదానంలో విధులు నిర్వహించే సిబ్బంది చేతివాటం చూపారు. వెంటనే ఆలయ అధికారులు కనుగొని రూ.1.30 లక్షల సరుకులు పట్టుకొని, వారిని విధుల నుంచి తొలగించారు. ఆలయంలో మూలవిరాట్‌ను గుర్తుతెలియని వ్యక్తి ఫొటోలు తీసి సామాజిక మాధ్యమంలో పెట్టడంతో క్రిమినల్ కేసులు నమోదు చేయించారు. దీంతో సెల్‌ఫోన్‌తో ప్రవేశాన్ని పూర్తిగా నిషేధించారు. సెల్‌ఫోన్లను కౌంటర్‌లో పెట్టి దర్శనానికి వచ్చేలా చర్యలు తీసుకున్నారు. దీనిపై ప్రచార బోర్డులు కూడా ఏర్పాటు చేశారు.

తిరుమల తరహాలో తనిఖీలు

భక్తులను మూడు చోట్ల తిరుమల తరహాలో ప్రవేశ గేట్ల వద్ద, ఆలయం లోపలకు ప్రవేశించే సమయంలో, అన్వేటి మండపం వద్ద మూడు సార్లు తనిఖీ చేస్తున్నారు. ఎవరైనా సెల్‌ఫోన్ వెంట తీసుకుని వస్తే క్యూ నుంచి బయటకు పంపేస్తున్నారు.

భక్తుల రద్దీ

కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిట లాడింది. క్యూలో ఉన్న భక్తులకు మజ్జిగ, తాగునీరు నీరు అందించారు.

ఆలయ ప్రతిష్టను కాపాడాలి

ఆలయ ప్రతిష్ట దెబ్బతినకూడదనే సెల్‌ఫోన్‌తో దర్శనంపై ఆంక్షలు పెట్టాం. అందరు కౌంటర్లలో సెల్‌ఫోన్‌లు పెట్టి వస్తున్నారు. భక్తులు కూడా సెల్‌ఫోన్ల రణగొణల శబ్దాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో స్వామివారిని దర్శించుకుంటున్నారు.

–మోహన్ రెడ్డి, ఆలయ చైర్మన్

అందరూ సహకరించాలి

సెల్‌ఫోన్లను ఆలయం లోపలికు తీసుకురాకుండ భక్తులు సహకరించాలి. ఇందుకోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశాం. అక్కడ సెల్‌ఫోన్లను భద్రపరుచుకోవాలి. వీఐపీలకు పీఆర్‌ఓ కా ర్యాలయం వద్ద నుంచి స్వామివారి దర్శనం కల్పిస్తున్నాం.

– వెంకటేశు, ఆలయ ఈఓ

మంత్రి పెద్దిరెడ్డితో జేసీ భేటీ



మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు ఆదివారం తిరుపతిలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలో రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఈ సందర్భంగా జేసీకి మంత్రి సూచించారు. ప్రభుత్వ ప్రాధాన్యత అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై వారు చర్చించారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు సమస్యల వినతులను అందజేయవచ్చని పేర్కొన్నారు. స్పందనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతం ఇస్తోందని తెలిపారు. ఆయా శాఖల జిల్లా అధికారులు కచ్చితంగా హాజరుకావాలన్నారు.

మరో ఏడాది ఉచితం



వీధి విక్రయదారుల గణాంకాలు సేకరిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

- చిత్తూరు కూరగాయల మార్కెట్ గేటు వైఎస్సార్‌సీపీ వశం
- రైతులకు గేటు ఉచితం చేసిన ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి
- ఇప్పటికే రూ.కోటిన్నర.. తాజాగా రూ.83 లక్షల చెల్లింపు
- ముఖ్యమంత్రి వైఎస్.జగన్ సంక్షేమ పథకాలే ఆదర్శమన్న నేత

చిత్తూరు అర్బన్: చిత్తూరు మార్కెట్ గేటు వసూళ్లు.. దౌర్జన్యాలకు, రౌడీయిజానికి అద్దంపట్టే దందా. పండించిన పంటను ప్రజలకు చేరువగా అమ్ముకోవడానికి పల్లె నుంచి పట్టణం వైపు వచ్చే రైతుల రక్తాన్ని పీల్చడం ఒకప్పటి ఆనవాయితీ. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఈ దందాలన్నింటికీ చరమగీతం పాడాలని ఆ పార్టీనేత విజయానందరెడ్డి ఆలోచించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా పెద్ద దిక్కుగా ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఇదే విషయాన్ని చెబితే భుజం తట్టి ప్రోత్సహించారు. ఇంకేముంది గత మూడేళ్లుగా రూ.2.33 కోట్ల తన సొంత ధనాన్ని కార్పొరేషన్‌కు చెల్లించి.. రైతులకు గేటును ఉచితం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సామాన్యులు, పేద ప్రజల కోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, లబ్ధి చేకూర్చే నిర్ణయాలే తనకు ఆదర్శమంటున్నారు. తాజాగా రూ.83 లక్షలు కార్పొరేషన్‌కు చెల్లించి.. రైతులకు మరోమారు గేటు ఉచితం చేస్తున్నట్లు విజయానందరెడ్డి ప్రకటించారు.

గతంలో రౌడీయిజం..దౌర్జన్యం

చిత్తూరులో 2014–2019 మధ్య కాలంలో మార్కెట్ గేటు వసూళ్ల టెండర్ల ప్రక్రియ నాటి టీడీపీ నేతల కనుసన్నల్లో జరిగేది. కేవలం పచ్చ నేతల ఆదాయం పెంచుకునేందుకు నామమాత్ర అంకెలతో టెండర్లు దక్కించుకుని ఆపై నగరంలోని రైతులు, చిన్న చితకా వ్యాపారుల రక్తాన్ని పీల్చుకుని దౌర్జన్యాలు చేసేవారు. టీడీపీ మాజీ మేయర్ అనురాధ, ఆమె భర్త మోహన్ జంట హత్యలకు కారణాల్లో మార్కెట్ గేటు వసూళ్లు కూడా ఒకటిగా పోలీసుల అభియోగపత్రంలో స్పష్టం చేశారు. ఏడాదికి రూ.50 లక్షల నుంచి రూ.90 లక్షల వరకు మార్కెట్ గేటు టెండర్లను దక్కించుకున్న టీడీపీ నేతలు ఈ మొత్తాన్ని రాబట్టడానికి నగరంలో నిత్యం రౌడీయిజం, దౌర్జన్యాలు, దందాలు చేసేవాళ్లు. గ్రామాల్లో పండించిన పంటను అమ్ముకునేందుకు చిత్తూరుకు వచ్చే రైతుల నుంచి నిర్ణీత రుసుం కంటే రెండింతలు బలవంతంగా వసూలు చేసేవారు. రోడ్డుపై పండ్లు, కూరగాయల నుంచి బొమ్మలు, తోపుడు బండ్లు ఇలా ప్రతి వ్యాపారి నుంచి గేటు పేరిట దౌర్జన్యాలకు దిగేవాళ్లు. కోళ్లను విక్రయించేందుకు వచ్చే పేదవాడినీ కాలితో తన్ని మరీ గేటు రుసుం వసూలు చేసిన రోజులు చిత్తూరు వాసులు అంత సులువుగా మరిచిపోలేరు. పైగా కార్పొరేషన్ నుంచి దక్కించుకున్న గేటు టెండర్ సొమ్ములో భారీగా గండికొట్టారు. ఇప్పటికీ టీడీపీ నేతల పేరిట చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.3 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి.

రైతుల్లో ఆనందం

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను రూపొందించారు. వీటిని పొందుతున్న లబ్ధిదారులు ఆనందాన్ని చూసిన ఏపీఎస్ ఆర్టీసీ వైస్‌చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంసీ విజయానందరెడ్డి చిత్తూరు మార్కెట్ గేటు టెండరు దక్కించుకుని ఆ మొత్తం తానే చెల్లించాలని సంకల్పించారు. కూరగాయల మార్కెట్‌తో పాటు ప్రైవేటు బస్సుల నుంచి పార్కింగ్ చార్జీలు, జంతువధశాల గేటు వసూళ్ల టెండర్లు, ప్రభుత్వ ఆస్పత్రిలో పార్కింగ్ టెండరు దక్కించుకుని ప్రజలకు, రైతులకు వీటిని ఉచితం చేశారు. ఇలా 2021–22 ఆర్థిక సంవత్సరానికి రూ.71.41 లక్షలు, 2022–23కు రూ.78.84 లక్షలు, 2023–24 సంవత్సరానికి రూ.83.02 లక్షలు తన సొంత నిధులను కార్పొరేషన్‌కు చెల్లించారు.

అందరికీ మంచి జరగాలి



వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకునే చిత్తూరు మార్కెట్ గేటు టెండర్లకు మూడేళ్లుగా నగదు చెల్లిస్తూ రైతులకు ఉచితం చేశాను. ఇది ప్రజల కోసం మాత్రమే. దీనివల్ల చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు, గంగాధరనెల్లూరు నియోజకవర్గాలతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చే రైతులు నగరంలో ఉచితంగా వ్యాపారాలు చేసుకోవచ్చు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, ఎంపీ మిథున్‌రెడ్డి నన్ను ప్రోత్సహించి వెన్నుగా నిలవడంతోనే ఈ సేవా కార్యక్రమం చేయగలుగుతున్నాను.

- ఎంసీ విజయానందరెడ్డి, వైస్ చైర్మన్, ఏపీఎస్ ఆర్టీసీ



చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,500
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,700

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.78

తిరుమల ఘాట్‌లో ప్రమాదం



అదుపుతప్పి బోల్తా పడ్డ కారు

తిరుమల: తిరుమల నుంచి తిరుపతికి వచ్చే మొదటి ఘాట్ రోడ్‌లో కారు అదుపుతప్పి బోల్తా పడిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, గుంటూరుకు చెందిన భక్తులు శ్రీవారిని దర్శించుకుని కారులో బయల్దేరారు. 34వ మలుపు వద్ద కారు పిట్టగోడను ఢీకొని బోల్తా పడింది. కారులో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.

టీచర్లు అయ్యాం..

తమ కష్టాలను గుర్తించి ఉద్యోగమిచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నింద్రకు చెందిన ఉపాధ్యాయులైన డీఎస్సీ 98 అభ్యర్థులు కేశవులునాయుడు, భాస్కర్ కృతజ్ఞతలు తెలిపారు. నింద్రకు చెందిన కేశవులు నాయుడు ఎంఈఓ నారాయణకు, భాస్కర్ నారాయణవనం హెచ్‌ఎం చెంచమ్మకు జాయినింగ్ రిపోర్టు అందజేశారు.

–నింద్ర





జాయినింగ్ రిపోర్టు అందజేస్తున్న కేశవులు నాయుడు, భాస్కర్

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ నాయకులు



మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన సిద్దిక్‌బాషా, తదితరులు

పుంగనూరు: తెలుగుదేశం పార్టీ నాయకుడు సిద్దిక్ బాషాతో సహా 15 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆదివారం రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప, ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో వీరంతా వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ముగిసిన జిల్లా స్థాయి చెస్ పోటీలు



గెలుపొందిన బాలబాలికలతో దివాకర్‌రెడ్డి, శ్రీనివాససూరి

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి జిల్లా అండర్–19 బాలబాలికల చెస్ పోటీలు ఆదివారం యూత్ హాస్టల్లో నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి బాలబాలికలు హాజరు కాగా, వారికి విడివిడిగా పోటీలు నిర్వహించారు. బాలికల విభాగంలో వి.త్రిపురాంబిక, వి.శ్రీగురువర్షిణి, బాలుర విభాగంలో వి.యాతిన్‌రెడ్డి, సాయి చరణ్ మొదటి రెండు స్థానాలు సాధించారు. వీరికి జిల్లా చెస్ అసోసియేషన్ చైర్మన్ సి.దివాకర్‌రెడ్డి పతకాలు, సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. జూన్ 15 నుంచి 18వ తేదీ వరకు నంద్యాలలో జరిగే అండర్–19 రాష్ట్ర చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా తరపున పాల్గొని విజయం సాధించాలని కోరారు. విజేతలను జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి హెచ్.శ్రీనివాససూరి అభినందించారు.

వ్యక్తిపై నాటుతుపాకీతో కాల్పులు

యాదమరి: ఆస్తి తగాదాల నేపథ్యంలో ఓ వ్యక్తి చంపేస్తానని బెదిరిస్తుండడంతో నిజంగానే అన్నంత పనీ చేస్తాడనే భయంతో ఓ వ్యక్తి అతడిపై నాటుతుపాకీతో కాల్పులకు తెగబడ్డాడు. దీంతో తీవ్రగాయాయ్యాయి. ఆదివారం సాయంత్రం ఈ సంఘటన మాదిరెడ్డిపల్లె బస్ స్టాప్ వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం..మాదిరెడ్డిపల్లెకు చెందిన రాజేంద్ర అదే గ్రామానికి చెందిన సురేష్(37)కు ఆస్తి తగాదాలున్నాయి. సురేష్‌పై ఇది వరకే కొన్ని కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఈ నేపథ్యంలో అతడు ఆస్తి తగాదాల నేపథ్యంలో చంపేస్తానంటూ అడపా దడపా రాజేంద్రను బెదిరిస్తుండడంతో అతడు ఆందోళన చెందాడు. తానే ఓ అడుగు ముందేస్తే పోలా అని ఆలోచించి సురేష్ అంతు చూడాలని నిర్ణయించుకున్నాడు. ఆదివారం సాయంత్రం మాదిరెడ్డిపల్లె బస్‌స్టాప్‌లో అతడిపై నాటుతుపాకీతో రాజేష్ కాల్చాడు. దీంతో రవ్వలు అతడి మోకాలులోకి దూసుకుపోయి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం సీఐ శ్రీనివాసులు రెడ్డి, ఎస్‌ఐ సుమన్ తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని పరిశీలించారు. సురేష్‌ను చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాజేంద్రను అదుపులోకి తీసుకున్నారు. నాటుతుపాకీని స్వాధీనం చేసుకున్నారు. నాటు తుపాకీ ఎక్కడి నుంచి రాజేంద్ర తెచ్చాడో విచారణలో తేలాల్సి ఉంది.

వైఎస్సార్‌సీపీలో బీసీలకు సముచిత స్థానం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

ఏర్పేడు: దేశంలో బీసీలకు అధిక పదవులు, పథకాలు ఇచ్చి సముచిత స్థానాన్ని కల్పించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పల్లంపేటలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో ఓసీలకే పదవులు ఉంటాయని ఎద్దేవా చేశారు. జగనన్న ఆశీర్వాదంతో నిజాయితీపరుడైన డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ఎమ్మెల్సీ అయ్యారని తెలిపారు. జగనన్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇంతమంది టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరడం హర్షణీయమన్నారు. కరోనా సమయంలో రూ.5 కోట్లు సొంత సొమ్ముతో సేవా కార్యక్రమాలు చేసినట్లు వివరించారు. బొజ్జల గోపాలకృష్ణారెడ్డి 35 ఏళ్లు ఎమ్మెల్యే, మంత్రిగా ఉండి చేసిన అభివృద్ధి ఏమటని ప్రశ్నించారు. బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి కరోనా సమయంలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కనిపించలేదన్నారు. ఎన్నికల సమయానికి శ్రీకాళహస్తికి వచ్చి మొసలి కన్నీరు కారుస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల పట్ల ప్రేమను పంచేది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనన్నారు. టీడీపీలో పదేళ్లు కష్టించినా తమకు న్యాయం జరుగలేదన్నారు. తాను ఎమ్మెల్సీ అవుతానని కలలో కూడా ఊహించలేదన్నారు.

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, జెడ్పీటీసీ తిరుమలయ్య, ఎంపీపీ గీత, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గురవారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శివయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు జనార్దన్, మాజీ ఎంపీటీసీ రమణయ్య యాదవ్, నాయకులు కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు, వెంకటాద్రి, గోవర్ధన్‌రెడ్డి, లోకనాథరెడ్డి, చెంగల్రాయులు, దశరథరామిరెడ్డి పాల్గొన్నారు.

నెక్ట్స్ ఏంటీ..?



పది పరీక్షలు పూర్తయి మే రెండోవారంలో ఫలితాలు రానున్నాయి. ఇప్పటికే విద్యార్థుల్లో ఏగ్రూపు తీసుకోవాలి ? ఏది తీసుకుంటే కెరీర్ బెటర్? ఎవరిని అడగాలి? అనే సందేహాలు ప్రారంభమయ్యాయి. ఉన్నత విద్యకు వారధి లాంటి ఇంటర్ మీడియెట్‌లో గ్రూపును ఎంచుకోవడమే అత్యంత కీలకమైన అంశం. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా..ఇష్టమైన సబ్జెక్టుపై దృష్టిసారించాలని, అప్పుడే ఉన్నతస్థాయికి చేరుకోవడానికి సులభతరమవుతుందని నిపుణులు, విద్యావంతులు, సైకాలజిస్టులు సూచిస్తున్నారు. ఇంటర్‌లో వివిధ కాంబినేషన్ గ్రూపులు.. వాటి వివరాలు ఇలా..

–గుడిపాల

- పది పూర్తయిన విద్యార్థుల్లో సందిగ్ధం
- తల్లిదండ్రులు, టీచర్లు చొరవ చూపాల్సిన సమయం
- సరైన ప్రణాళికతో ఉజ్వల భవిష్యత్

ఎంపీసీ: ఇంజినీరింగ్ వృత్తిలో స్థిరపడాలనుకునే వారు తీసుకునే గ్రూపు ఎంపీసీ. రాష్ట్రంలో ఎంసెట్ రాయాలనుకునేవారు, సివిల్, మెకానిక్, ఎలక్ట్రికల్, కంప్యూటర్స్, ఏరో నాటికల్స్ తదితర రంగాల్లో ఇంజినీరింగ్ చేయాలనుకొనే వారికి ఎంపీసీ గ్రూప్ పునాది వంటిది. బిట్స్ పిలానీలో ప్రవేశానికి జరిగే బిగ్‌షాట్ రాసేందుకు ఎంపీసీ విద్యార్థులే అర్హులు.

బైపీసీ: డాక్టర్, వైద్య సంబంధ వృత్తులు, ఉద్యోగాల్లో స్థిరపడాలనుకునేవారు బైపీసీ వైపు శ్రద్ధ చూపవచ్చు. అగ్రికల్చర్ గ్రూపులకు ఈగ్రూప్ ప్రతిపాదిక. ఓపిగ్గా చదవడం.. స్పష్టంగా బొమ్మలు గీయగలగడం ఈ గ్రూప్ విద్యార్థులకు ఉండవలసిన లక్షణాలు.

పాలిటెక్నిక్: పదవ తరగతి తరువాత ఏదైనా సాంకేతిక విద్యలో నైపుణ్యం సాధించి ఉపాధి పొందాలంటే ఉత్తమ మార్గం పాల్‌టెక్నిక్. ఇందుకోసం పాల్‌టెక్నిక్ కామన్ ఎంట్రన్స్ సెట్(పాలిసెట్)ఉత్తీర్ణత సాధించాలి.

ఎంఈసీ, సీఈసీ: సేవారంగం వైపు వెళ్లాలనుకునేవారు, సైన్స్, ఆర్ట్ గ్రూపులపై పెద్దగా ఆసక్తి లేనివారు పట్టుదలతో కూడిన ఎంఈసీ లేదా కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్, సబ్జెక్టులున్న సీఈసీ గ్రూపులో చేరవచ్చు. చార్టెడ్ అకౌంటెంట్లు, కంపెనీ సెక్రటరీలు, కమర్షియల్ ఏజెంట్లు, బ్యాంక్‌మేనేజర్ వంటి వృత్తుల్లో చేరదలుచుకున్న వారు, స్టాక్ మార్కెట్లలో ఉద్యోగాలు కావాలనుకున్న వారు ఈ గ్రూపును ఎంపిక చేసుకోవచ్చు.

ఐటీఐ: ఇండస్ట్రియల్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్ కోర్సులను ఎంచుకోవడం ద్వారా పదవ తరగతి తరువాత రెండేళ్లలో సాంకేతిక విద్యలో నైపుణ్య సాధించవచ్చు. చిన్న వయసులోనే ఉపాధి పొందే అవకాశం ఉంది. పరిస్థితులు అనుకూలిస్తే సాంకేతిక విద్యారంగంలో ఉన్నతస్థాయి విద్యాకోర్సులు చేయవచ్చు.

భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకోవాలి



భవిష్యత్‌లో ఏం కావాలో నిర్ణయం తీసుకుని..ఆ లక్ష్యంతో కోర్సును ఎంపిక చేసుకోవాలి. ఏదిపడితే అది, ఒకరిని చూసి మరొకరు పోటీపడి కోర్సులను ఎంపిక చేసుకుని కెరీర్ పాడు చేసుకొని చదువును మధ్యలో ఆపవద్దు. అమ్మా, నాన్న ఆశలకు గండికొట్టవద్దు.

లోకేష్, అధినేత, సీఎన్‌ఆర్ కళాశాల, గుడిపాల

ఇష్టమైన సబ్జెక్ట్ ఎంచుకోవాలి



కష్టమైన సబ్జెక్టు కాకుండా ఇష్టమైన సబ్జెక్టును ఎంచుకుంటే ఒత్తిడి లేకుండా చదువుకోవచ్చు. ఎవరో చెప్పారని కష్టమైన గ్రూప్‌ను తీసుకుని ఒత్తిడికి గురై భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దు. చదువుతో పాటు క్రీడారంగంలో రాణించేందుకు ప్రయత్నించాలి. ఏదో ఒక మార్గంలో దృష్టిసారిస్తే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చు.

అర్జున్,తెలుగు అధ్యాపకుడు, గుడిపాల

కంగారువద్దు



కంగారుపడి నిర్ణయాలు తీసుకోకూడదు. తల్లిదండ్రులు చొరవ చూపి పిల్లలకు సరైన కోర్సును సూచించాలి. ఫలితాలు వెలువడక ముందే నిర్ణయాలు తీసుకోకుండా ఫలితాలొచ్చిన తరువాత ఏ సబ్జెక్టులో ప్రావీణ్యం, ఆసక్తి ఉందో దాని ఆధారిక కోర్సులకు ప్రాధాన్యం ఇవ్వాలి.

రామ్‌నాయక్,ఎంఇఓ, గుడిపాల